సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 1 । నవంబర్ । 2023



భర్తను అంతమొందించిన భార్య

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో ఇద్దరు ప్రియుళ్లతో కలిసి పక్కా పథకంతో భర్తను, భార్య అంతమొందించింది. -8లో



కోట స్థలాలు ఆక్రమణ

గుర్రంకొండ కోట స్థలాలను కొంతమంది జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకున్నారు. అలాగే అక్కడే ఉన్న పురావస్తుశాఖ బోర్డును ఆక్రమణదారులు పీకేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.240	రూ.310
రెండోరకం	రూ.140	రూ.280

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 461 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	467	510
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 717.480 కిలోలు

న్యూస్‌రీల్

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతులు

రాయచోటి : సీనియర్ తహసీల్దార్‌లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వులలో అన్నమయ్య జిల్లా నుంచి ఐదు మంది తహసీల్దార్లకు చోటు లభించింది. కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణనాయుడు, రాయచోటి తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, వీరబల్లి తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, చిట్వేలి తహసీల్దార్ శిరీషా, రైల్వేకోడూరు తహసీల్దార్ రామమోహన్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

డీఎస్‌ఓగా బాధ్యతలు

కడప సెవెన్‌రోడ్స్: గాలేరు నగరి సుజల స్రవంతి భూసేకరణ విభాగం–2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కౌసర్ భానుకు వైఎస్సార్ జిల్లా పౌర సరఫరాల అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఆమె ఎఫ్‌ఏసీగా కొనసాగాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరంలో 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7వతేదీ వరకు గడువు పొడగించినట్లు వైఎస్సార్ జిల్లా డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో అన్నమయ్య, కడప జిల్లాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు www.navodaya.gov.in సంప్రదించాలని తెలిపారు. 2014 ఫిబ్రవరి,10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పీజీ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, ప్రిన్సిపల్, సీఈ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి మంగళవారం విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ గత నెలలో పీజీ పరీక్షలు నిర్వహించామని, అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఏజీ.దాము, ఆచార్య పి.పద్మ, ఆచార్య రఘుబాబు, డా.ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

నీటి కుళాయిల పరిశీలన



కుళాయిలు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో జల్ జీవన్ మిషన్ అమలును అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. స్థానిక అరుంధతి కాలనీ, హరిజనవాడలో ఆయన పర్యటించి నీటి కుళాయిలను పరిశీలించారు. ప్రతి ఇంటికీ కుళాయి వేయించాలని స్థానికులు అసిస్టెంట్ కలెక్టర్‌కు విన్నవించారు. పథకం ఆశయం మేరకు అందరి ఇళ్లకు కుళాయిలు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి దీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరక్కోణం ప్యాసింజరు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–అరక్కోణం మధ్య నడుస్తున్న అరక్కోణం ప్యాసింజరును నవంబరు 12వ తేదీ వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. అక్టోబరు 25 నుంచి ఈ రైలు ద్దు చేశామని, దీనిని నవంబరు 12వ తేదీ వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. తమ ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

జయంతి...దారి మళ్లింపు

పుణె–కన్యాకుమారి మధ్య నడుస్తున్న జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు (16381/16382)ను నవంబరు 6వ తేదీ నుంచి 12 వతేదీ వరకు దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రైలు పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా వా రంరోజుల పాటు నడుస్తుందని, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి రైల్వేస్టేషన్లకు పైన తెలిపిన తేదీ ల్లో రైలు రాదని జనార్దన్ పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పది పరీక్షలకు తొలి అడుగు



- పరీక్షల షెడ్యూలు విడుదల
- 10లోగా ఫైన్ లేకుండా చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షల ప్రక్రియలో తొలి అంకానికి అడుగు పడింది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం షెడ్యూలు విడుదల చేసింది. ఈనెల 10లోగా అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న రెగ్యులర్ /ఫెయిల్ అయిన అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. వరుసగా నాలుగో ఏడాది కూడా పరీక్ష ఫీజుల్లో ఎలాంటి పెంపుదల చేయకపోవడం విశేషం.

అపరాధ రుసుం లేకుండా...

నవంబర్ 10లోగా పదో తరగతి పరీక్ష ఫీజు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నవంబర్ 10వతేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లోని లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాలి. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 16వరకు, రూ. 200ల అపరాధ రుసుంతో 22వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంది. నవంబర్ 23 నుంచి 30వతేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజును చెల్లించే వీలుంది. పైన పేర్కొన తేదీల్లో ఏవైనా సాధారణ సెలవు దినాలుంటే తర్వాత పనిదినం రోజున కూడా ఫీజు చెల్లించడానికి అనుమతిస్తారు. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి 17,391 మంది విద్యార్థులున్నారు. వీరితో పాటు ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 10 వేలమందికిపైగా విద్యార్థులు వచ్చే ఏడాది పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష ఫీజు ఇలా..



రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలి. ఫెయిలైన అభ్యర్థులు మూడు కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు,ఎస్‌ఎస్‌సీ పరీక్ష ఫీజు రూ.125కు అదనంగా మరో రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ వయస్సున్న విద్యార్థులు (అండర్ ఏజ్ స్టూడెంట్స్)ఫీజుగా రూ.300 చెల్లించాలి. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ (సీడబ్ల్యూఎస్‌ఎన్) విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి చేసిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఆన్‌లైన్‌లోనే నామినల్ రోల్స్ సబ్మిట్ చేయాలి. సమయం తక్కువ ఉన్నందున పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్ష ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ తయారీకి సన్నద్ధం కావాలి. హెచ్‌ఎంలు మాన్యువల్ నామినల్ రోల్స్ తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలి.

–శ్రీరాం పురుషోత్తం, డిఈఓ, రాయచోటి

పొరపాట్లకు తావివ్వొద్దు



ఎటువంటి పొరపాట్లుకు అవకాశం లేని విధంగా నామినల్ రోల్స్‌ను ఒకటి,రెండు సార్లు సరి చూసుకుని మాత్రమే సబ్మిట్ చేయాలి. చిన్న తప్పు దొర్లినా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె

వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఏక్తా రన్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ



పటేల్ సేవలు మరువలేనివి

రాయచోటి : సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏక్తా రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఏక్తారన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రజలు ఎంతో ఆసక్తితో పాల్గొన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా దేశ సమగ్రతను సమైక్యతను గుర్తించుకునేందుకు యూనిటీ రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మన జీవితంలో సమగ్రత మరియు సమైక్యత అనే భావాలను దృష్టిలో పెట్టుకొని జీవించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, పలువురు జిల్లా అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

రాయచోటి: అన్నమయ్య జిల్లా, రాయచోటిలో నూతనంగా నిర్మించే క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో నవంబర్ 15వ తేది నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ దాదాపు 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందులో ముఖ్యంగా స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, స్టేడియం పరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు, స్టేడియం నుండి ప్రధాన రోడ్డు నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ మొత్తం పచ్చదనంతో నిండి ఉండాలన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లా రాయచోటి పట్టణంలో పెద్ద క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ 11వ తేది నుంచి జనవరి 15వ తేది వరకు జరిగే ఆడుదాం ఆంధ్రాకు క్రీడా పోటీలను నూతన క్రికెట్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్అండ్‌బీ జిల్లా అధికారులు, మున్సిపల్ తహశీల్దార్ హేమంతకుమార్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు ప్రణాళిక

స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కరవు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ తయారుచేయాలని జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఆకేపాటి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని పలు మండలాల్లో నీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. గతంలో నీటి రవాణాకు సంబంధించిన కోటి రూపాయల బకాయిలు త్వరలో చెల్లిస్తామన్నారు. జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లున్నా, పలుచోట్ల ఇసుక అక్రమంగా తరలించడంతో భూగర్భజలాలు అడుగంటే సమస్య ఉందన్నారు. ఒంటిమిట్ట మండలం బాలరాజుపల్లెలో రీచ్ లేకపోయినా ఇసుక తరలిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారని, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు. నవంబర్ 5న రాజంపేటలో ఆర్థో పెడిక్ మెగా హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సింగరయ్య కాలనీలో నీటి సమస్య ఉందని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. ట్యాంకర్ రూ.500 ఖర్చుచేసి ఇంటి నిర్మాణాలకు వినియోగించుకోవాలంటే పేదలకు తలకు మించిన భారమవుతోందన్నారు. సచివాలయ భవన నిర్మాణ పనులకు బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలని జెడ్పీ చైర్మన్ కోరారు. తమ మండలంలోని మున్నెల్లి సచివాలయ భవానాన్ని ఎందుకు ప్రారంభించలేకపోయారో చెప్పాలని బి.కోడూరు జెడ్పీటీసీ దావీద్ అడిగారు. మైదుకూరు, దువ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా కోరారు. జలకళ కింద 70 బోర్లు మంజూరైనా వేయలేదని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ఆరోపించారు. రామసముద్రం పంచాయతీలో 220 బేస్‌మెంట్‌లు ఏర్పాటు చేసుకోగా బిల్లులు చెల్లించలేదని బి.కోడూరు జెడ్పీటీసీ తెలిపారు. ఖాజీపేట మండలంలో విద్యుత్తు పరికరాల పంపిణీలో అక్రమాలు సరిదిద్దే చర్యలు చేపట్టాలని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా అన్నారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ. 102 కోట్లతో పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.102 కోట్లతో 2155 పనులు చేపట్టినట్లు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకట్రావు తెలిపారు. వాటిలో రూ.40 కోట్ల విలువచేసే 1000 పనులు పూర్తిచేశామని తెలిపారు. రూ.34 కోట్లకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయగా, రూ.30 కోట్లు విడుదల చేశారన్నారు. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అన్నమయ్య జిల్లాలో రూ.27.70 కోట్లతో 922 పనులు చేపట్టగా, రూ.6.16 కోట్ల పనులు పూర్తిచేశామని సీపీఓ వివరించారు.

స్టాక్ మార్కెట్‌లో అవకాశాలు మెండు

వైవీయూ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు స్టాక్ మార్కెట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఒమన్ దేశ మస్కట్ కళాశాల మాజీ ఆచార్యులు, ప్రస్తుత సెబీ శిక్షణ నిపుణులు డా. కె. ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ ఎంబీఏ శాఖ ఆధ్వర్యంలో 'యువ నిర్వాహకుల ఆర్థిక విద్య' అన్నఅంశంపై రెండురోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, మెలకువలు, ఉపాధి అవకాశాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డా. అమృతప్రసాద్‌రెడ్డి, డా.వై. సుబ్బరాయుడు, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, డా.వరప్రభాకర్, డా. సరిత, డా.ఎస్.సుబ్బారెడ్డి, డా. గంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబీ నిపుణుడు ప్రభాకర్

పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలి



భూ సేకరణ అంశంపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎన్‌హెచ్71, ఎన్‌హెచ్ 42 లకు సంబంధించి పరిహారం చెల్లింపులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లాలోని ముదివేడు బ్యాలెన్స్ రిజర్వాయర్, ఎన్‌హెచ్ 71, ఎన్‌హెచ్ 42 పరిహారం చెల్లింపు ప్రగతిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన 1074.63 ఎకరాలు భూ సేకరణను పూర్తి చేశామన్నారు. సేకరించిన భూమికి పరిహారం పంపిణీని పూర్తి చేశామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే సహాయ పునరావాస కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఎస్‌డీసీ సంబంధిత తహశీల్దార్‌లను ఆదేశించారు. ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుంచి పీలేరు వరకు నాలుగు వరుసల జాతీయ రహదారికి సంబంధించి 234.44 హెక్టార్ల భూ సేకరణ పూర్తి చేశారని, ఇందుకు మొత్తంగా రూ. 141.92 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 117.58 కోట్లు లబ్ధిదారులకు పరిహారం పంపిణీ చేశారన్నారు. మిగిలిన రూ. 24.34 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. అలాగే ములకల చెరువు నుంచి మదనపల్లి ఎన్‌హెచ్ 42కు సంబంధించి 45.037 హెక్టార్లకుగాను 41.85 హెక్టార్లు భూ సేకరణ చేయగా మిగిలిన 2.187 హెక్టార్లు కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉందన్నారు. కోర్టు కేసును త్వరితగతిన ముగించేలా అధికారులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ మురళీ, హెచ్‌ఎంఎస్‌ఎస్ యూనిట్–2 ఎస్‌డీసీ గోపాలకృష్ణ, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఉన్నతవిద్యలో ఉద్యోగ విప్లవం

- వైవీయూలో 118 పోస్టులు, ఏఎఫ్‌యూలో 138 పోస్టులకు నోటిఫికేషన్
- దశాబ్దకాలం తర్వాత అందివచ్చిన అవకాశం
- ఉమ్మడి పోర్టల్ ద్వారా ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- ఆశావాహుల్లో ఆనందం



వైవీయూ ముఖద్వారం

వైవీయూ: రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ఉన్నతవిద్యలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావాహుల్లో ఆనందం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్‌ఐటీల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడంతో విశ్వవిద్యాలయ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 3220 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసింది ఇందులో భాగంగా యోగివేమన విశ్వవిద్యాలయంలో 118 పోస్టులకు, నూతనంగా ఏర్పాటైన డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయంలో 138 పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేశారు. బ్యాక్‌లాగ్ నోటిఫికేషన్‌లతో పాటు, రెగ్యులర్ నోటిఫికేషన్‌లు జారీచేశారు. వీటితో పాటు రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో సైతం పోస్టుల భర్తీ చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సైతం అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హత, రాతపరీక్ష.. ఇంటర్వ్యూ ద్వారా..

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ, విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ విధానంలో నియామక ప్రక్రియ నిర్వహించనున్నారు. అభ్యర్థి అర్హతలకు అనగా పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్, స్లెట్, జేఆర్‌ఎఫ్, అంతర్జాతీయ, జాతీయ పబ్లికేషన్స్, పరిశోధన తదితర అంశాల ఆధారంగా పారదర్శకంగా అభ్యర్థికి మార్కులు కేటాయించనున్నారు. అదే విధంగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్‌ల (కాంట్రాక్ట్ అధ్యాపకులు)కు యేడాదికి 1 మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కులకు వెయిటేజి ఇస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి 4:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపికచేస్తారు.

పోస్టుల వివరాలు..

యోగివేమన విశ్వవిద్యాలయం (రెగ్యులర్ ప్లస్ బ్యాక్‌లాగ్)

అసిస్టెంట్ ప్రొఫెసర్లు : 43
అసోసియేట్ ప్రొఫెసర్లు : 46
ప్రొఫెసర్లు : 26
నాన్ అకడమిక్ పోస్టులు: 03
మొత్తం : 118

డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం

అసిస్టెంట్ ప్రొఫెసర్లు : 81
అసోసియేట్ ప్రొఫెసర్లు : 36
ప్రొఫెసర్లు: 16
నాన్ అకడమిక్ పోస్టులు : 05
మొత్తం : 138

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు..

రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో నోటిఫికేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మంగళవారం నుంచే రిజిస్ట్రేషన్ నిర్వహించుకునే అవకాశం కల్పించారు. దీంతో ఉన్నతవిద్యామండలి వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు వన్‌టైం రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత అభ్యర్థుల ఎంపిక చేసుకున్న విశ్వవిద్యాలయం, పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

బహుమతుల పంపిణీ



వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన హారికకు బహుమతి అందజేస్తున్న ఎస్పీకృష్ణారావు

రాయచోటి: పోలీస్ అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ కృష్ణారావు బహుమతులను అందజేశారు. రాయచోటిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వివిధ పోటీలలో విజేతలైన వారికి ఎస్పీ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్‌కమల్, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది, వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడని ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సీఐ వివరాల మేరకు మహావీర్ సర్కిల్ ప్రాంతంలో తిరుగుతుండేవాడు. అతన్ని గుర్తించిన వారు 9121100510, 91211 00511 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పక్కా పథకంతో భర్తను అంతమొందించిన భార్య

- ఇద్దరు ప్రియుళ్లతో కలిసి హత్యకు స్కెచ్
- పోలీసుల అదుపులో నిందితులు
- పరారీలో ప్రధాన సూత్రధారి



వెంకటశివ హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, చిత్రంలో నిందితులు రమణమ్మ, గగన్, బిందుప్రియ



రమణమ్మ (ఫైల్)



గగన్ (ఫైల్)

మదనపల్లె : వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ఇద్దరు ప్రియుళ్లతో కలిసి పక్కా పథకంతో భర్తను, భార్య అంతమొందించింది. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహబూబ్‌బాషాతో కలిసి డీఎస్పీ కేశప్ప మీడియాకు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కలకడ మండలం సింగనొడ్డిపల్లెకు చెందిన దాదినేని వెంకటశివ(45), రమణమ్మ(40) భార్యాభర్తలు. వీరి కుమార్తెకు వివాహం చేసిన తర్వాత దంపతులిద్దరూ ఏడాది క్రితం మదనపల్లెకు వచ్చి నీరుగట్టువారిపల్లెలో అద్దె ఇంట్లో ఉంటూ టమాటా మార్కెట్‌యార్డులో పనిచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో భార్య రమణమ్మ టమాటా మార్కెట్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న బసినికొండకు చెందిన షేక్ బషీర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అతడితో పాటుగా తమ ఇంటిపక్కన ఉన్న గంగాధర్ అలియాస్ గగన్(21)తోనూ వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. ఇంటి ముందు చెత్తవేస్తూ, పరిసరాలు అపరిశుభ్రంగా చేస్తున్నారని గగన్ అక్క ముంతల బిందుప్రియ(25) మృతుడు వెంకటశివతో కొంతకాలం క్రితం గొడవ పెట్టుకుంది. అప్పుడు వెంకటశివ పరుషంగా మాట్లాడటంతో అతడిపై వ్యక్తిగతంగా కక్ష పెట్టుకుంది. ఈ నేపథ్యంలో రమణమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్న డ్రైవర్ షేక్‌బషీర్ ఇంటికి వచ్చివెళుతూ, వెంకటశివతో పక్కింటివారికున్న తగాదాను తెలుసుకున్నాడు. రమణమ్మతో తన సంబంధం సజావుగా సాగాలంటే వెంకటశివను అంతమొందించాలని భావించి పక్కింటి వారైన గగన్, బిందుప్రియతో కలిసి పథకం రచించాడు. వెంకటశివను చంపితే రూ.25,000 డబ్బులు ఇస్తానని వారికి ఆశ చూపాడు. దీంతో వారు వారం ముందే వెంకటశివను చంపేందుకు నిర్ణయించుకుని మద్యం తాగించారు. అయితే అనుకున్నట్లు జరగకపోవడంతో పథకం వాయిదావేశారు. ఈ క్రమంలో గత నెల 29న అతిగా మద్యం సేవించిన వెంకటశివ మత్తులో తూలుతూ ఇంటి ముందర పడిపోవడంతో తలకు గాయమైంది. భర్త తలకు గాయమై, స్పృహలో లేకపోవడాన్ని గమనించిన భార్య రమణమ్మ అప్పటికప్పుడు గగన్, బిందుప్రియలకు హత్య చేసేందుకు ఇదే సరైన సమయంగా చెప్పి రావాలని కోరింది. సింగనొడ్డుపల్లెలోని వెంకటశివ తల్లికి ఫోన్‌చేసి భర్త తాగి ఇంటి ముందు పడిపోవడంతో తలకు గాయమైనట్లు చెప్పింది. ఆమె మీ ఖర్మ. మీ బాధలు మీరే పడండని చెప్పడంతో రమణమ్మ రోకలిబడితో వెంకటశివకు తలపై గాయమైన చోట కొట్టగా, గగన్ ఉరితాడు తీసుకుని వెంకటశివ గొంతు కింద బలంగా పట్టుకున్నాడు. బిందుప్రియ నోరు మూసిపట్టుకుంది. రమణమ్మ తన భర్త కాళ్లు పట్టుకోవడంతో వెంకటశివ ఊపిరాడక చనిపోయాడు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా రమణమ్మ తమకు బంధువైన ఆటో డ్రైవర్ రవిని పిలిచి, మరణించిన తన భర్తను సింగనొడ్డుపల్లెకు తీసుకువెళ్లాల్సిందిగా కోరింది. అక్కడకు వెళ్లాక వెంకటశివ అన్న తన తమ్ముడు తాగి కిందపడి తలకు గాయమైతే, మెడపై తాడుతో ఉరివేసిన చారలు ఎందుకు ఉన్నాయని అనుమానంతో ప్రశ్నించాడు. రమణమ్మ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానంతో కలకడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో రమణమ్మ, గగన్‌లను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు కథ బయటపడిందన్నారు. దీంతో హత్యలో పాల్గొన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, ప్రధాన సూత్రధారి అయిన లారీ డ్రైవర్ షేక్‌బషీర్ లోడు వేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో, త్వరలో అతడిని అరెస్ట్ చేస్తామన్నారు.

అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీ సీజ్

చక్రాయపేట : ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీతో పాటు అందులోని 300 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపారు. మంగళవారం అద్దాలమర్రి క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ 16టీహెచ్7927 నంబరు గల లారీలో బియ్యం బస్తాలు కనిపించాయన్నారు. వాటిపై విచారణ జరుపగా అవి అక్రమంగా తరలిస్తున్నవని గుర్తించి వెంటనే లారీతో పాటు అందులోని 300 బస్తాల బియ్యం సీజ్ చేసి చక్రాయపేట తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు. లారీలో ఉన్న ప్రొద్దుటూరుకు చెందిన మాబు షరీఫ్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ కుటుంబీకులకు అప్పగింత

వేంపల్లె : మతిస్థిమితం లేని ఓ మహిళను వేంపల్లె ఎస్ఐ తిరుపాల్‌నాయక్ మంగళవారం కుటుంబీకులకు అప్పగించినట్లు మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలిలా.. మూడు నెలల క్రితం వేంపల్లె పట్టణంలో మతిస్థిమితం లేని మహిళను గుర్తించి ఎస్ఐ తిరుపాల్‌నాయక్ స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు. అనంతరం ఆమె అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ధానేస్‌పల్లి గ్రామానికి చెందిన మాధవి (మతిస్థిమితంలేని మహిళ)గా గుర్తించి, ఆమె తల్లి రాణెమ్మకు అప్పగించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం చేస్తూ ఎస్ఐ తిరుపాల్‌నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ కోట స్థలాల ఆక్రమణ



గుర్రంకొండ కోట వద్ద ఎన్‌హెచ్ 340 రహదారిపై రాత్రికి రాత్రే వెలసిన బంకులు



కోటస్థలాల ఆక్రమణలపై విచారణ జరుపుతున్న పోలీసులు

- జేసీబీలతో బోర్డులు పీకేసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పురావస్తు అధికారులు

గుర్రంకొండ : చరిత్రాత్మక గుర్రంకొండ కోట స్థలాలను కొంతమంది జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకున్నారు. అక్కడే ఉన్న పురావస్తుశాఖ బోర్డును ఆక్రమణదారులు పీకేశారు. జరిగిన సంఘటనపై స్థానిక పురావస్తుశాఖ అధికారి రామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప–బెంగళూరు జాతీయ రహదారి ఎన్‌హెచ్ 340 పైన గుర్రంకొండ కోట సరిహద్దుల్లో లక్షలాది రుపాయలు విలువచేసే స్థలాలు ఉన్నాయి. కోటలోని ఆనందిబాషా దర్గాకు వెళ్లే మార్గంలో గత రాత్రి కొతమంది జేసీబీలతో స్థలాలను చదును చేశారు. అక్కడే ఉన్న కోట గోడను కొంత మేరకు జేసీబీతో కూలదోసి అక్కడే ఉన్న కందకాల్లో పడేశారు. రోడ్డుపక్కన పురావస్తుశాఖ వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా జేసీబీలతో పీకేసి కోట గోడ పక్కనున్న కాలువలో పడేశారు. లక్షలాది రుపాయలు విలువచేసే స్థలాలను చదును చేసి రాత్రికి రాత్రే బంకులను ఏర్పాటు చేశారు. దీంతో కోట ముఖద్వారం వద్ద రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికే సుమారు ఆరు బంకులు కోటస్థలాల్లో వెలిశాయి. జరిగిన సంఘటనపై స్థానిక పురావస్తుశాఖాధికారి రామ్మూర్తి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దిలీప్ కుమార్, ఏఎస్ఐ నరసింహులు తమ సిబ్బందితో కలసి వెళ్లి ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణదారులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. జరిగిన సంఘటపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కుమార్

మదనపల్లె : భవన నిర్మాణ కార్మికుడిని పట్టపగలే అతిదారుణంగా కొట్టి, ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి కాల్చి చంపేందుకు యత్నించిన ఘటన మదనపల్లెలో జరిగింది. మండలంలోని కొత్త ఇండ్లు రంగారెడ్డి కాలనీలో కాపురం ఉంటున్న కాకర్ల ఆంజనేయులు కుమారుడు కె.ప్రవీణ్‌కుమార్(35) భవన నిర్మా ణ కార్మికుడిగా పని చేస్తూ, భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. ప్రవీణ్‌కు మద్యం తాగే అలవాటుంది. అతిగా మద్యం సేవించినప్పుడు చుట్టుపక్కల వారిని దుర్భాషలాడటం, గొ డవకు దిగడం చేస్తుంటాడు. ఈ క్రమంలో అదే కాలనీలో ఉంటున్న కుమార్, అంజి, మరికొంతమందిని కొద్దిరోజుల క్రితం బండబూతులు తిట్టి అవమానపరిచాడు. దీంతో వారు ఆగ్రహంతో ప్రవీణ్‌కుమార్‌ను అంతమొందించాల ని నిర్ణయించుకున్నారు. ముందుగానే అనుకు న్న పథకం ప్రకారం ప్రవీణ్‌ను మందు తాగేందుకు వెళదాం రమ్మని ఊరికి సమీపంలోని ఎలకపల్లెకుంట వడ్డిపల్లె గుట్టలోకి తీసుకెళ్లారు. అ క్కడ ప్రవీణ్‌ను అతి కిరాతకంగా కొట్టి, నడు ము, కాళ్లు, చేతులు విరిచి పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రవీణ్‌కుమార్ గట్టిగా కేకలు వేయడంతో నిందితులు అతడిని అక్కడే వదిలేసి పారిపోయారు. దీనిని గమనించిన స్థానికులు ప్రవీణ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని అపస్మారకస్థితిలో ఉన్న అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి, పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాల్సిందిగా రెఫర్ చేశారు. ఘటన విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సుధాకర్ ఆస్పత్రికి చేరుకుని బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు గల కారణాలపై ఆరా తీసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యకరం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడం పట్ల టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడంపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వ్యంగ్యంగా స్పందించారు. మంగళవారం సాయంత్రం కడప నగరంలోని 23వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్కిల్ స్కాం కేసులో చంద్రబాబుకు విముక్తి లభించలేదని, ఆయనకు ఆరోగ్యం బాగాలేదు స్కిన్ ఎలర్జీ వచ్చింది...కంటిచూపు కోల్పోయే ప్రమాదముందని లాయర్లు ప్రాధేయపడితే న్యాయమూర్తి మానవతా హృదయంతో కనికరించి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చారన్నారు. చంద్రబాబుకు ఆరోగ్యం బాగాలేక బెయిల్ వస్తే టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నాలుగు వారాల తర్వాత మళ్లీ బాబు జైలుకెళ్లాల్సిందేనని, ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించాలన్నారు. ఈ నాలుగు వారాల్లో చంద్రబాబును మంచి వైద్యులకు చూపించి కంటిచూపు కోల్పోకుండా కాపాడాలని, చూపు పోతే ఆయన్ను చూసేవారు కూడా ఉండరని చెప్పారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీపై కేంద్రం శీతకన్ను



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

రాజంపేట టౌన్ : ఆంధ్రప్రదేశ్‌పై కేంద్ర ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక గీతాంజలి జూనియర్ కళాశాలలో మంగళవారం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు, కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా ఆ రోజున వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తామని స్పష్టం చేసిన కేంద్రం, ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని అమీత్‌షా ప్రకటించడం సరైనది కాదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమకు కూడా కేంద్రం సహకరించడం లేదని వారు ఆరోపించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే రాయలసీమ జిల్లాల్లోని నిరుద్యోగులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను నిర్లక్ష్యం చేస్తున్నా రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని వారు ప్రశ్నించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగే ష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమర వీరుల ముగింపు వారోత్సవాలు



జాతీయ సమైక్యత పరుగులో పోలీసులు, విద్యార్థులు

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో మంగళవారం పోలీసు అమర వీరుల ముంగిపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అందరితో ఆయన జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమాండెంట్ వి. కేశవరెడ్డి జెండాను ఊపి (రన్‌ఫర్ యూనిటీ) జాతీయ సమైక్యత పరుగును ప్రారంభించారు. ఈ పోటీల్లో బెటాలియన్ ఆఫీసర్స్, సిబ్బంది, సిద్ధవటం, బెటాలియన్ స్కూల్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కె. వెంకటరెడ్డి, వి. జయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దుల మల్లేశ్వరరెడ్డి (53) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చాపాడు మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన మల్లేశ్వరరెడ్డి నర్సరీలో కూలి పనికి వెళ్తుంటాడు. అతనికి భార్య పార్వతితో పాటు కుమారుడు శివారెడ్డి, శిల్ప అనే కుమార్తె ఉన్నారు. శివారెడ్డి హైదరాబాద్‌లో ఒక కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. మంగళవారం మల్లేశ్వరరెడ్డి కాకిరేనిపల్లె సమీపంలోని నర్సరీ వద్దకు పనికి వెళ్లాడు. పని ముగించుకొని సాయంత్రం అక్కడే పని చేస్తున్న మరో మహిళను కూర్చోబెట్టుకొని బైక్‌లో గ్రామానికి బయలుదేరాడు. పెద్దశెట్టిపల్లె సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్‌లో వస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

కాలువలో పడి వీఆర్ఓ మృతి



మృతి చెందిన వీఆర్ఓ

నందలూరు (రాజంపేట) : మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలోని కాలువలో ప్రమాదవశాత్తు పడి అవసాని వెంకటేశ్వర్లు (46) మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మన్నూరు సీఐ పుల్లయ్య, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజంపేట సాయినగర్‌కు చెందిన మృతుడు గతంలో పొత్తపి వీఆర్ఓగా పనిచేశాడని, ప్రస్తుతం ముద్దనూరులో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.